క్లుప్తంగా

విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలి



గుంటూరు రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.సాయిప్రసాద్ సూచించారు. బుధవారం 48వ డివిజన్ రెడ్డిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి డాక్టర్ ప్రియ అధ్యక్షతన శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కె.సాయిప్రసాద్ మాట్లాడుతూ మాత్రలు తీసుకోవడం వల్ల ప్రయోజనాలను వివరించారు. యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లాలో గురువారం, ఈనెల 17న మాత్రల పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో రెడ్డిపాలెం యూపీహెచ్‌సీ ఏఎన్ఎం రాజేశ్వరి, చైతన్య కళాశాల ఏజీఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన




చేబ్రోలు: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి సూచనలతో జరిగిన సమావేశంలో స్టెప్ మేనేజర్ బి.రాధిక, కౌన్సిలర్ ఎస్.అయ్యప్ప, హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు వివిధ అంశాలపై 212 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యార్థులు నా భూమి – నా దేశం ప్రతిజ్ఞ చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయండి



ప్రత్తిపాడు: వ్యవసాయ కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉన్నామని ప్రతిపాడు వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి తన్నీరు ప్రభుదాస్ చెప్పారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న గుంటూరు జిల్లా సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ జరుగనుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని రైతులతో పాటు కార్మిక సోదరులంతా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎస్.వీరాంజనేయులు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు షేక్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.

సినీనటుడు కార్తికేయ సందడి



పెదకాకాని: ఆర్ఎక్స్ 100 ఫేమ్ కార్తికేయ హీరోగా నేహాశెట్టి హీరోయిన్‌గా లౌక్యం ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో కొత్త దర్శకుడు క్లాక్ దర్శకత్వంలో రూపొందిన బెదురులంక–2012 చిత్ర బృందం నంబూరు వీవీఐటీలో బుధవారం సందడి చేసింది. చిత్ర హీరో కార్తికేయ మాట్లాడుతూ ఆగస్టు 25న చిత్రం విడుదల కానుందని వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు నృత్యం చేశారు. సెల్ఫీలు దిగి సందడి చేశారు. హీరోయిన్ నేహాశెట్టి మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ అలరిస్తుందని చెప్పారు.

హైజంపర్ మొహిద్దీన్‌కు ఆర్థిక సాయం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల జాతీయ స్థాయి కాంస్య పతకం సాధించిన హై జంపర్ మొహిద్దీన్‌కు సహస్ర ఆర్థో, న్యూరో హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.శివకుమార్ బుధవారం రూ.23 వేలు అందజేశారు. ఈ మేరకు అథ్లెటిక్ కోచ్ జీ.వి.ఎస్. ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహిద్దీన్‌లో అద్భుత ప్రతిభ ఉందని, దాతల సహాయం చేయాలని ఆయన కోరారు.

ఊరూరా 'నా భూమి–నా దేశం'

ప్రత్తిపాడు/గుంటూరు రూరల్/పెదనందిపాడు/చేబ్రోలు: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నా భూమి– నా దేశం కార్యక్రమాలను నిర్వహించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చెరువు గట్లపై ప్రత్యేక శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. పాతమల్లాయపాలెం గ్రామంలో సర్పంచ్ కాసు పద్మావతి ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని జాతికి అంకితం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ. శ్రీరమ్య నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని చేపట్టారు.

■ వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వై.వాణి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి లక్ష్మీనారాయణ, ఉగ్గిరాల సీతారామయ్య, కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జె.అప్పారావు పాల్గొన్నారు.

■ వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. 75 మీటర్ల జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ చేపట్టి, 75 మొక్కలు నాటారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ నార్నె రాజ్యలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలో గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటారు.

■ ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను అర్పించిన అమర వీరుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్లకార్డులతో కళాశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా అమర వీరుల స్మృతికి చిహ్నంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆగస్టు 9 నుంచి ఆగస్టు 30 వరకు విద్యార్థులతో మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.

■ చిన్నపలకలూరు గ్రామంలోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధుల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో దాసుపాలెం సర్పంచ్ ఆలపాటి వీరయ్య, గ్రామ సెక్రటరీ జోత్స్న, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తంగెళ్ళ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ హెచ్ భవాని, బి.నరేష్, వేమయ్య, దేగల శివనాగేశ్వరరావు, రాయప్ప పాల్గొన్నారు.

■ పెదనందిపాడు మండలం పాలపర్రు, అన్నవరం, రాజుపాలెం, పెదనందిపాడు గ్రామాల్లో బుధవారం నాభూమి– నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి మనోరంజని మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల గురించి వివరించారు. అనంతరం సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్ పాల్గొన్నారు.

■ నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు మండలంలోని గొడవర్రు, శలపాడు, శేకూరు గ్రామాల్లో బుధవారం అధికారుల బృందం వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. శలపాడు గ్రామానికి చెందిన రిటైర్డు హవల్దారు యార్లగడ్డ ఏడుకొండలును అధికారులు సన్మానించారు. రక్షణదళంలో పనిచేస్తున్న ఆయన 2004లో జరిగిన బాంబు పేలుడులో గాయపడ్డారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుకొండలును అధికారులు సన్మానించారు. శేకూరుకు చెందిన ఆపరేషన్ రక్షక్‌లో చనిపోయిన కె.శివయ్య కుటుంబసభ్యులను కూడా అధికారులు సన్మానించారు. గొడవర్రుకు చెందిన రిటైర్డు హవల్దారు షేక్ హబీబుల్లా కుటుంబ సభ్యులనూ అధికారులు సత్కరించారు. జెడ్పీ సీఈవో మోహన్‌రావు పలు చోట్ల జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బాబురావు పాల్గొన్నారు.



మలినేని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏటుకూరులో అవగాహన ర్యాలీ



కిట్స్ కళాశాలలో 75 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన



కుర్నూతలలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గోపాలకృష్ణ



ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరమ్య



గొడవర్రులో హవల్దారు షేక్ హబీబుల్లాను సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ మోహనరావు తదితరులు



పాతమల్లాయపాలెంలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ పద్మావతి



ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, విజ్ఞాన్ నిరుల కళాశాల విద్యార్థులు



పెదనందిపాడులో అమర వీరుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న మనోరంజని తదితరులు

జీవాల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి

పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్లు

చేబ్రోలు: మేకలు, గొర్రెలు, జీవాల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ టీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గొర్రెలు, మేకలు, పొట్టేలు పెంపకందారులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ టీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫార్ములేటింగ్ మార్కెటింగ్ ఎంట్రీ ఫైన్యువల్ స్కీం ద్వారా పాలతో తయారు చేసే యూనిట్‌కు రూ.30 లక్షల రుణం 30 శాతం సబ్సిడీతో లభిస్తుందని పేర్కొన్నారు. చికెన్ పచ్చడి తయారీ యూనిట్, చికెన్ మటన్ షాపుల ఏర్పాటు, మినీ డెయిరీల ఏర్పాటుకు రుణ సదుపాయం ఉంటుందని వెల్లడించారు. ఏడీ అనీల్ కుమార్ మాట్లాడుతూ బీమా, వ్యాధుల నివారణ తదితర అంశాల గురించి, వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి గురించి తెలియజేశారు. ఏపీఎం వి.నాగేశ్వరరావు, డీడీ కేవీ సత్యనారాయణ, ఏడీ ఎ.శ్రీనివాసరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అద్దంకి త్రివేణి, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ టీపీ వెంకటేశ్వర్లు

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కౌసల్యాదేవి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో నా దేశం–నా మట్టి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా మానవాళి మనుగడకు మొక్కలే ఆధారం అనే అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ. రాధామాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మాధవపెద్ది గిరిజ, కె. లక్ష్మీదీప్తి, అధ్యాపకులు పద్మజ, భారతి, పద్మావతి పాల్గొన్నారు.



మొక్కలతో ప్రిన్సిపాల్ కౌసల్యాదేవి, రాధామాధవి, అధ్యాపకులు

కన్నుల పండువగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

పాత గుంటూరు: మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు శివకుమారశర్మ, చంద్రశేఖరశర్మ మంత్రార్థాలను వివరిస్తూ భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు గుంటూరు వేమారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

మేయర్ కావటి మనోహర్‌నాయుడు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సంపత్ నగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆప్కాస్, బ్యాంక్, నగర పాలక సంస్థ అకౌంట్స్ అధికారులతో అవుట్ సోర్సింగ్ కార్మికులకు రుణ మంజూరుపై ప్రత్యేక సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో ఇప్పటికే బీమా సౌకర్యం కల్పించి, ప్రీమియం కూడా నగర పాలక సంస్థే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్మికులకు కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఆరోగ్య అవసరాలకు ఉపయోగపడేలా తక్కువ వడ్డీకి బ్యాంక్ రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. బ్యాంకర్స్ కూడా కార్మికులకు రుణాలు ఇవ్వడానికి పెద్ద మనస్సుతో ముందుకు రావాలని ఆయన కోరారు. సమావేశంలో ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగ ప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ డేనియల్, యూనియన్ బ్యాంకు రీజినల్ సీనియర్ మేనేజర్ గోపీచంద్, హిందూ కాలేజీ బ్రాంచ్ మేనేజర్ త్రివేణి, నగరపాలక సంస్థ అకౌంటెంట్ రవి కిరణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు పాల్గొన్నారు.



అధికారులు, బ్యాంకర్లతో సమావేశమైన మేయర్ కావటి మనోహర్ నాయుడు

ముందస్తు వైద్య పరీక్షలతో ఆరోగ్య పరిరక్షణ ఉత్తమం

గుంటూరు మెడికల్: వ్యాధులు వచ్చాక ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ సూచించారు. అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మణి హోటల్ సెంటర్ బాలాజీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు, వైద్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటిదాకా లక్షలాది మంది ప్రజలకు ఆరోగ్య సేవలు అందించామని, తమ ట్రస్టు సేవల్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య శిబిరంలో ఆయనతో పాటు డాక్టర్ బలరామకృష్ణ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ, పార్టీ రీజనల్ కో– ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్ని పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, పలు గిరిజన ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలకు సంక్షేమం, అభివృద్ధి అందజేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. విద్య, వైద్యాన్ని వారి దరి చేరుస్తూ, సంస్కృతీ సంప్రదాయాల్ని కాపాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదివాసీలు, గిరిజనులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజ్యోతు హనుమంత్ నాయక్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు ముంతాజ్, బిక్కునాయక్, వెంకటసుబ్బయ్య, తోకల నరసింహారావు, గనిక ఝాన్సీ, పార్టీ నేతలు పాల్గొన్నారు.



డాక్టర్ వైఎస్సార్, ఆదివాసీల ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ రాజశేఖర్

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



పెదకాకాని: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గుంటూరు డెప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడేళ్లపాటు గణిత ఉపాధ్యాయునిగా పనిచేసిన షేక్ అలీషా ఉద్యోగోన్నతిపై బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు పాఠశాలకు హెచ్‌ఎంగా బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి డెప్యూటీ ఈఓ పి.వెంకటేశ్వర్లు, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసిం విచ్చేశారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధనలు, మన బడి నాడు–నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. అనంతరం గ్రేడ్–2 హెడ్ మాస్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన షేక్ అలీషాను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గోళ్లమూడిలో పొలంబడి



పెదకాకాని: విత్తన మొలకశాతం ఆధారంగా అవసరమైన విత్తనాలను వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి చెప్పారు. పెదకాకాని మండలంలోని గోళ్ళమూడి గ్రామ శివార్లలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ముందుగా విత్తనం మొలక కట్టుకోవడం ద్వారా విత్తనాలు వాడుకోవాల్సి ఉంటుందన్నారు. విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేక చార్ట్‌ల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శివాజీ, వీఏఏలు విజయలక్ష్మి, లక్ష్మీభవాని, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొత్తూరువారితోటకు చెందిన షేక్ ఖలీల్ రహమాన్ టెలిగ్రామ్ యాప్‌లో ఈడీ షాప్–7 అనే యాడ్ చూస్తూ లింక్ ఓపెన్ చేశాడు. తమ యాప్‌లో డబ్బులు జమ చేస్తే అధికంగా తిరిగి వస్తాయని చెప్పడంతో రూ. 1.57లక్షలు వేశాడు. అయితే, తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న వ్యక్తుల అరెస్టు

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణి హోటల్ సెంటర్‌లో రహమతుల్లా సింగిల్ నంబరు లాటరీ ఆడిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పాత గుంటూరు స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ బాషా దాడి చేసి పట్టుకున్నారు. ఈ సమయంలో గుట్టు చప్పుడు కాకుండా పక్కనే ఉన్న సంధ్యా బార్‌లో స్లిప్పులు రాయించి ఆట ఆడిస్తున్నట్లు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి నుంచి రూ. 17వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌లోని అమృత టవర్స్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు భార్య సింధూర (35) అనారోగ్యంతో బాధపడుతోంది. మానసికంగా కృంగిపోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యానుకు చున్నీ వేసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.